క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

డెంకాడ: మండలంలోని పెదతాడివాడలో గల దంతులూరి వెంకట సింహాద్రి రాజు కల్యాణ మంటపంలో 1998 – 99 సంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమణి, విజయలక్ష్మి, సుభాషిణి, దుర్గాగౌరి, బందారు రామలక్ష్మి, బందారు శ్రీరాములు, అరుణ, పద్మావతి, కొండపల్లి శ్రీరామమూర్తి, బంధవు గోవింద పాల్గొన్నారు.

ప్రతి ఇల్లూ గ్రంథాలయంగా మారాలి



రావివలసలో సంచార గ్రంథాలయం వద్ద పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు, యువత

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ ఇల్లు గ్రంథాలయంగా మారాలని ఆశయ రూరల్ లైబ్రరీ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. మండలంలోని రావివలస గ్రామంలో ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో ఆదివారం సంచార గ్రంథాలయ సేవలను అందుబాటులో ఉంచారు. విద్యార్థులు, యువతతో పుస్తక పఠనం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిలోనూ విజ్ఞాన పుస్తకాలు ఉండాలన్నారు. తల్లిదండ్రులు బయటకు వెళ్లేటప్పుడు ఒక పుస్తకాన్ని తీసుకొచ్చి ఇంటిలో ఉంచాలన్నారు.విలువైన సమయాన్ని టీవీలు, మొబైల్స్‌తో కాలక్షేపం చేస్తూ వృథా చేయకుండా పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం ద్వారా మేథస్సు పెరుగుతుందన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

గుర్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ భాస్కరరావు సూచించారు.మండల కేంద్రంలో పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలు వురు మైనర్లను గుర్తించి కేసులు నమోదు చేశారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే జైలు శిక్ష, జరిమానా తప్పదన్నారు.

21న భారత్ బంద్



మాట్లాడుతున్న ప్రజాగాయకుడు ఉదయ్‌భాస్కర్

శృంగవరపుకోట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఈనెల 21న భారత్ బంద్ నిర్వహించనున్నట్లు ప్రజా గాయకుడు ఆతవ ఉదయ్ భాస్కర్ తెలిపారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో స్థానిక దళిత నేతలు డోల కేశవ, గుగ్రపు శ్రీను, తెరపల్లి కోటారావు ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసం దర్భంగా ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ షెడ్యూలు కులాలు, తెగల మధ్య సుప్రీం తీర్పు కులాల చిచ్చు రగిలించిందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడవడాన్ని దళిత సంఘాలు ఖండిస్తున్నాయన్నా రు. కోర్టు తీర్పును నిలిపివేయా లని కోరుతూ 21న ప్రతీ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. దళిత నాయకులు బండ అప్పన్న, తెరపల్లి అప్పారావు, బోని శేఖర్, లోకేటి ఈశ్వరరావు, గాలి క్రాంతి, డోల రాము తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో ఓవరాల్ చాంపియన్ 'విజయనగరం'

తాడిపత్రి అర్బన్: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా తాడిపత్రిలో సాగుతున్న రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను దక్కించుకున్నారు. పోటీల్లో 13 జిల్లాలకు చెందిన సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

రెండో రోజు ఆదివారం జరిగిన పోటీల్లో విజయనగరం జిల్లా చాంపియన్ షిప్‌ను దక్కించుకోగా, రెండో స్థానంలో అనంతపురం జిల్లా, మూడో స్థానంలో తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు నిలిచారు. ఈ పోటీల్లో బంగారు పతకాలను సాధించిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు సాయి తెలిపారు.



పూల్‌బాగ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటగది నిర్మాణం పూర్తికాకపోవడంతో వేరే గదిలో వంటలు చేస్తున్న నిర్వాహకులు

విద్యారంగంపై నీలి నీడలు..

- పాఠశాలల అభివృద్ధి శూన్యం
- చాలీచాలని యూనిఫారాలు
- మధ్యాహ్న భోజనం మెనూ అమలులో నిర్లక్ష్యం

పాఠశాలల వివరాలు	
నియోజకవర్గంలో మొత్తం పాఠశాలల సంఖ్య:	123
ఉన్నత పాఠశాలల సంఖ్య:	16
ప్రాథమికోన్నత పాఠశాలల సంఖ్య:	9
ప్రాథమిక పాఠశాలల సంఖ్య :	98
ఆయా పాఠశాలల్లో చదువుతున్న మొత్తం విద్యార్థుల సంఖ్య:	15,724



కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యారంగంపై నీలినీడలు అలముకున్నాయి. విద్యాభివృద్ధితోనే సామాజిక అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ విద్యారంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారు. పాఠశాలలకు కావాల్సిన అదనపు భవనాలు మంజూరు చేయడంతో పాటు విద్యార్థులకు పుస్తకాలు, షూలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందజేసి విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు పొందారు. అయితే రెండు నెలల కిందట కూటమి ప్రభుత్వం ఏర్పటైనప్పటికీ ఇంతవరకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేకపోయారు. అలాగే యూనిఫారాలు, షూల పంపిణీలో కూడా కొన్ని కొన్ని ఇబ్బందులేర్పడ్డాయి. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీపీఎం పాఠశాలలో అదనపు భవన నిర్మాణం చివరి దశకు చేరుకున్నప్పటికీ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు చేపట్టకపోవటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అదేవిధంగా పూల్‌బాగ్ ప్రాంతంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటగది లేకపోవడంతో వంటలకు నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి..	
మండల పరిధిలో పాఠశాలల అభివృద్ధికి చేసిన ఖర్చు :	రూ.7 కోట్లు
విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఖర్చు చేసింది:	రూ.19.42 కోట్లు

మెనూ అమలు అంతంతమాత్రమే..

విజయనగరం నియోజకవర్గ పరిధిలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే మెనూ సక్రమంగా అమలు కావడం లేదని సమాచారం.

కొలతలు తారుమారు..

ఇదిలా ఉంటే విద్యార్థులకు ప్రభుత్వం యూనిఫారాలు పంపిణీ చేసింది. అయితే 90 శాతం మందికి యూనిఫారాలు, పుస్తకాలు అందజేయగా.. మరో పది శాతం మంది విద్యార్థులు వాటి కోసం ఎదురు చూస్తున్నారు. అలాగే విద్యార్థులకు షూలు అందజేసేందుకు ముందస్తుగానే కొలతలు తీసినప్పటికీ, చాలామందికి చాలీచాలని షూలు రావడంతో బయట కొనుగోలు చేయాల్సి వచ్చిందని చెబుతున్నారు.

నేటికీ అందని బూట్లు..

పూసపాటిరేగ : వైఎస్సార్‌సీపీ హయాంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. పాఠ్యపుస్తకాలు, షూలు, యూనిఫారాల పంపిణీలో అలసత్వం వహించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆందోళన తప్పడం లేదు. నెల్లిమర్ల నియోజకవర్గంలో 223 ప్రాథమిక పాఠశాలలు, 21 ప్రాథమికోన్నత పాఠశాలలు, 52 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో కలిపి 296 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 9 ప్రైవేట్ ప్రైమరీ పాఠశాలలు, 29 ప్రైవేట్ ప్రాథమికోన్నత పాఠశాలలు, 15 ప్రైవేట ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 23,712 మంది విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల్లో 10,191 మంది విద్యార్థులు చదువుతున్నారు.

అందని షూలు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 23,712 మంది విద్యార్థులకు యూనిఫారాలు, షూలు అందాల్సి ఉన్నా, నేటికీ పూర్తిస్థాయిలో అందలేదు. కొంతమంది విద్యార్థులకు అందించిన షూలు చాలీచాలనవి కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే యూనిఫారాల్లో కూడా నాణ్యత లోపించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



తాళ్లపేటలో వినియోగంలో ఉన్న శిథిల భవనం

డీఆర్‌ఓ గణపతిరావు సేవలు శ్లాఘనీయం



గజమాలతో సత్కరిస్తున్న ఉడాకాలనీ సహవాసులు

విజయనగరం అర్బన్: శ్రీకాకుళం జిల్లాలో డీఆర్‌ఓగా ఉద్యోగ విరమణ చెసిన జిల్లా వాసి ఎం.గణపతిరావును ఆదివారం స్థానిక ప్రైవేట్ సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన రెవెన్యూ ఉద్యోగులు, ఉడాకాలనీ వాసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గణపతిరావు జిల్లాలో వివిధ క్యాడర్లలో పనిచేసి జిల్లా పాలనలో ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. అనంతరం డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, కలెక్టరేట్ ఏఓ దేవ్‌ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటిండెంట్‌లు శ్రీకాంత్, భాస్కరరావు, పలువురు తహసీల్దార్లు, కలెక్టరేట్‌లోని డీటీలు, సీనియర్ అసిస్టెంట్లు గణపతిరావును సత్కరించారు. అదేవిధంగా గణపతిరావు, రమణమ్మ దంపతులను ఉడాకాలనీ వాసులు గజమాలతో సత్కరించారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు..

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి విజయకల్యాణి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయ కల్యాణి

విజయనగరం టౌన్: యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. విజయ కల్యాణి సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ తిరుమల నర్సింగ్ హోమ్ నుంచి మయూరీ జంక్షన్ వరకు ఆదివారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యువత మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు రవాణా చేసినా, వినియోగించినా చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో తిరుమల నర్సింగ్ హోమ్ విద్యార్థులు, ఆదిత్య, నారాయణ కళాశాల విద్యార్థులు, ఇస్కాఫ్ సంస్థ సభ్యులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ఈగలతో.. కంటిమీద కునుకు ఉండడం లేదు..

- సమీపంలో ఉన్న కోళ్ల ఫారాల వల్ల భారీ సంఖ్యలో ఈగలు
- రోగాలతో ఇబ్బంది పడుతున్నాం : గంట్లాం వానులు
- అధికారులు చర్యలు తీసుకోవాలి



చిన్నారిపై వాలిన ఈగలు

డెంకాడ: ఈగలే కదా అనుకున్నారు.. ఆ గ్రామ ప్రజలకు ఈగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కూర్చుంటే తేనెపట్టుకు తేనెటీగలు ఎలా ఉంటాయో అలాగ వచ్చి చేరుతున్నాయి. భోజనం చేస్తుంటే అన్నం ముద్దతో పాటు నోటిలోకి ఈగలు వెళ్లిపోతున్నాయి. ఎలా బతికేది అంటూ ఊసురోమంటున్నారు గంట్లాం గ్రామ ప్రజలు. ఈ సీజన్‌లో గ్రామం వదిలిపోవాలన్నంతగా ఈగలు వీరిని ఇబ్బంది పెడుతున్నాయి. గ్రామ సమీపంలో ఉన్న కోళ్లఫారాల నుంచి పెద్దసంఖ్యలో ఈగలు ఉత్పత్తి అవుతున్నాయని, ఇవి అతి సమీపంలో ఉన్న తమ గ్రామంలోకి ప్రవేశించి ఇబ్బంది పెడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

నోటీసులతో సరి..

గ్రామ సమీపంలో ఉన్న కోళ్లఫారంతో ఈగలు విపరీతంగా గ్రామంలో వస్తున్నాయని గంట్లాం గ్రామస్తులు ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యల కోసం ఉన్నతాధికారులు ఆదేశించారు. పంచాయతీ అధికారులు సదరు కోళ్ల ఫారం ప్రతినిధులకు నోటీలు జారీ చేసి చేతులు దులుపుకున్నారు.

సమస్య పరిష్కరించాలి

ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని గంట్లాం వాసులు కోరుతున్నారు. కోళ్లఫారాలను వేరే ప్రాంతానికి తరలించి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది..



ఈగలతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఈగల నివారణకు పంచాయతీ తరపున చర్యలు తీసుకుంటున్నా ఫలితం శూన్యం. కోళ్లఫారం యాజమాన్యం స్పందించి ఈగల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– గుడిమెట్ల అప్పలరాజు, ఉప సర్పంచ్, గంట్లాం గ్రామం

చర్యలు తీసుకోవాలి..



ఈగలు ప్రజలను వేధిస్తున్నాయి. ఉన్నతాధికారులు గ్రామంలో పర్యటించి స్వయంగా మా సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే చాలా మందికి ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదు.

– మల్లపురాజు బంగారమ్మ, సర్పంచ్, గంట్లాం

అన్నదాతల సంక్షేమంపై నిర్లక్ష్యం

- ఉబాలు పూర్తయినా మొదలు కాని పంట నమోదు
- నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది రైతుల ఎదురుచూపు



చౌడువాడలో ఈక్రాప్ నమోదు చేయని వరిపంట

పూసపాటిరేగ : అన్నదాతల సంక్షేమంపై నూతన సర్కారు నిర్లక్ష్యం కనబరుస్తోంది. అన్నదాతకు ప్రధాన అవసరమైన పెట్టుబడి సాయం ఇంతవరకు ఇవ్వలేదు. అప్పుచేసి సాగు ప్రారంభించినా ఈక్రాప్ నమోదు చేయలేదు. ఉబాలు పూర్తయినా ఇంతవరకు ఈక్రాప్ నమోదు చేయకపోవడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అనుకోని విపత్తు జరిగితే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందా, లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సాధారణ విస్తీర్ణం 19,672 ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 4376 ఎకరాలలో వివిధ పంటలు సాగులో ఉన్నాయి. వర్షాలు అడపాదడపా పడుతుండడంతో సాగు విస్తీర్ణం మరంత పెరిగే అవకాశం ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా పంటల సాగు సమయంలో వ్యవసాయశాఖ సిబ్బంది పంట పొలాల వద్దకు వచ్చి ఈక్రాప్ నమోదు చేసేవారు. దీంతో అనుకోని సమయాల్లో పంటలు దెబ్బతింటే ప్రభుత్వం నుంచి పరిహారం అందేది. అలాగే దిగుబడులను కూడా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఇంతవరకు ఈక్రాప్ నమోదు చేయకపోతే తమ పరిస్థితేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈక్రాప్‌కు సంబంధించి విధివిధానాలు వచ్చినా దానికి సంబంధించిన మొబైల్ యాప్ రాలేదని సమాచారం. దీంతో ఈక్రాప్ నమోదు ఇంకా ఆలస్యం కానున్నట్లు భోగట్టా.

గత ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించి వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటును అందించారు. దీంతో పాటు ఈక్రాప్ నమోదు ద్వారా పంటల సాగుకు ఎరువులు, పంట అమ్మకాలు, పంటకు నష్టం జరిగినప్పుడు పరిహారం అందించేవారు. ప్రస్తుతం ఈక్రాప్ నమోదు ఇంతవరకు చేపట్టలేదు. నెల్లిమర్ల నియోజకర్గంలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, మినుమ, పెసర పంటలు సాగు చేస్తున్నారు.

ఈ క్రాప్ చేయాలి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నాయి. నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఇంతవరకు వ్యవసాయ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో ఈక్రాప్ నమోదు చేయలేదు. విపత్తులు వస్తే రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి వెంటనే ఈక్రాప్ చేయాలి.

– కోరాడ వెంకటరావు, రైతు, పూసపాటిరేగ

త్వరలోనే ఈక్రాప్ ప్రారంభిస్తాం..



ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ నమోదుకు ప్రభుత్వం నుంచి విధివిధానాలు వచ్చాయి. దీంతో పాటు వెబ్‌ల్యాండ్ డేటాను డౌన్‌లోడ్ చేసుకుంటున్నాం. వీఏఏలకు మొబైల్ యాప్ రావాల్సి ఉంది. రెండు, మూడు రోజులులో ఈక్రాప్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

కె.నీలిమ, మండల వ్యవసాయ శాఖాధికారి పూసపాటిరేగ

సుప్రీం తీర్పు సంతోషదాయకం

- ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇజ్రాయిల్



స్వీట్స్ తినిపించుకుంటున్న ఎంఈఎఫ్ నాయకులు

విజయనగరం ఫోర్ట్: ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సంతోషదాయకమని మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) జిల్లా అధ్యక్షుడు పెంకి ఇజ్రాయిల్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో మాదిగ ఉద్యోగులు స్వీట్స్ తినిపించుకుని సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేసిన ఎనలేని కృషి, పోరాటాల ఫలితమే సుప్రీం తీర్పు అని కొనియాడారు. ఈ తీర్పు వల్ల ఎస్సీ వర్గీకరణ జరిగి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు అరసాడ రవికుమార్ మాదిగ, యందవ పైడితల్లి మాదిగ, మందపల్లి నిర్మలమూర్తి మాదిగ, యజ్జల సంజీవరావు మాదిగ, బాత దిలీప్ కుమార్ మాదిగ, డి. ప్రభాకర్ మాదిగ, అరసాడ రాజశేఖర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.